క్లుప్తంగా

విద్యుత్‌ సమస్యలపై ఫిర్యాదు చేయండి

కూకట్‌పల్లి: విద్యుత్‌ సమస్యలపై అధికారుల ఫోన్‌ నెంబర్లలో మార్పు జరిగిందని అధికారులు గురువారం తెలిపారు. విద్యుత్‌ సమస్య ఉన్నవారు ఈ నూతన నంబర్లలో అధికారులను సంప్రదించాలని తెలిపారు. కూకట్‌పల్లి డీఈ 8712472652, కూకట్‌పల్లి ఏడీఈ 87124 72694, కూకట్‌పల్లి ఏఈ 87124 72700, కూకట్‌పల్లి ఎఫ్‌ఓసీ 8712472717 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నేడు విద్యుత్‌ సరఫరాకు అంతరాయం

మూసాపేట: ఆంజనేయ నగర్‌ 11 కేవీ ఫీడర్‌ పరిధిలో విద్యుత్‌ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎలక్ట్రికల్‌ ఏఈ భీమ లింగప్ప గురువారం తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆంజనేయ నగర్‌, జనతానగర్‌, మూసాపేట, ఇందిరానగర్‌, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు హబీబ్‌నగర్‌, పవర్‌నగర్‌ పార్కు, ప్రగతినగర్‌, వసుంధర హాస్పిటల్‌, మూసాపేట వార్డు కార్యాలయం, టి. అంజయ్య నగర్‌, శివశక్తి నగర్‌ ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

అల్లాపూర్‌ 11 కేవీ ఫీడర్‌ పరిధిలో..

మోతీనగర్‌: అల్లాపూర్‌ 11 కేవీ ఫీడర్‌ పరిధిలో విద్యుత్‌ మరమ్మతుల కారణంగా విద్యుత్‌ నిలిపివేస్తున్నట్లు ఏఈ రాకేష్‌ గౌడ్‌ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గాయత్రినగర్‌, జ్యోతి నగర్‌, లక్ష్మీనగర్‌, చంద్రా గార్డెన్‌ ప్రాంతం, శివ బస్తి, 11కేవీ పర్వత్‌నగర్‌ ఫీడర్‌ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు వివేకానందనగర్‌, పర్వత్‌ నగర్‌, ప్రభుత్వ స్కూల్‌ ప్రాంతంలో విద్యుత్‌ నిలిపివేయనున్నట్లు తెలిపారు.

ఆర్టీసీ నుంచి ఒక్క రోజు తీర్థయాత్ర

మూసాపేట: ఆర్టీసీ సంస్థ ప్రత్యేక టూర్‌ ప్యాకేజీని అందిస్తున్నదని కూకట్‌పల్లి డిపో మేనేజర్‌ హరి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27వ తేదిన వివిధ తీర్థ యాత్రల కోసం కూకట్‌పల్లి డిపో నుంచి బస్సు సౌకర్యం ఏర్పాటు చేస్తున్నామని, పెద్దలకు రూ.500, చిన్నారులకు రూ.300 రుసుము నిర్ణయించినట్లు తెలిపారు. కేపీహెచ్‌బీ కాలనీ నుంచి కొత్తూరులోని పద్మనాభ స్వామి ఆలయం, ముచ్చింతల్‌లోని సమతా మూర్తి ఆలయం, అమ్మపల్లిలోని శ్రీసీతారామ స్వామి ఆలయం, శంషాబాద్‌లోని వెండికొండ సిద్దేశ్వర స్వామి ఆలయాలను దర్శించుకొని కేపీహెచ్‌బీకాలనీకి బస్సు తిరిగి వస్తుందని తెలిపారు. ఒకవేళ ఒక కాలనీ నుంచి 35 మంది అంతకన్నా ఎక్కువ మంది ఉన్నా ఆ కాలనీ వద్దకే బస్సు పంపించనున్నట్లు పేర్కొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

మోతీనగర్‌: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని పూర్వ మోతీనగర్‌ మాజీ కౌన్సిలర్‌ సి.హెచ్‌. సత్యనారాయణ అన్నారు. గురువారం మూసాపేట డివిజన్‌లోని శ్రీ విఘ్నేశ్వర ఆలయ 8వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉదయం గణపతి పూజ, సకల దేవతా మూర్తులకు పంచామృతాభిషేకం, అనంతరం దేవతా మూర్తులకు అలంకరణ, 12 గంటలకు సాయి మహారథి, మధ్యాహ్నం అన్నదానం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షులు గార్లపాటి మోహన్‌ రెడ్డి, సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ స్వామి, సంక్షేమసంఘం సభ్యులు పాల్గొన్నారు.

నేడు 'డయల్‌ యువర్‌ డీఎం'

రాయదుర్గం: గచ్చిబౌలిలోని హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్సిటీ ఆర్టీసీ బస్‌ డిపో పరిధిలోని ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి శుక్రవారం 'డయల్‌ యువర్‌ డీఎం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్‌ మురళీధర్‌రెడ్డి గురువారం తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. బస్సుల వేళలు, సమయపాలన, ఇతరసమస్యలు ఉంటే ప్రయాణికులు తమకు ఫోన్‌ ద్వారా తెలిపితే వాటిని పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. 9959226132నెంబరుకు ఫోన్‌ చేయాలన్నారు.

'సండే ఈవినింగ్‌ టాక్‌' కార్యక్రమం

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్‌ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్‌ టాక్‌' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఈ సందర్భంగా 'యన్‌ ఇన్‌స్పిరేషనల్‌ లైఫ్‌ స్టోరీ ఆఫ్‌ మాతేశ్వరి జగదాంబాసరస్వతి' అంశంపై బ్రహ్మకుమారీస్‌ సంస్థ రూరల్‌ అండ్‌ అగ్రికల్చర్‌ డెవలప్‌మెంట్‌ వింగ్‌ వైస్‌ చైర్మన్‌ బి.కె.రాజు ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు.

పెండింగ్‌ పనులను పూర్తి చేస్తాం

చెరువుల సుందరీకరణ పనులను వేగవంతం చేయాలి

- పుట్టిన ఊరు కూకట్‌పల్లి ప్రజలకు ఏ లోటు రాకుండా చూసుకునే బాధ్యత నాదే
- కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



నల్ల చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు తదితరులు

కూకట్‌పల్లి: డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేస్తామని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. క్యాంపు కార్యాలయంలో గురువారం కూకట్‌పల్లి డివిజన్‌కు సంబంధించిన పలు సమస్యలపై జూపల్లి సత్యనారాయణ, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా కూకట్‌పల్లి నల్లచెరువును పరిశీలించి సుందరీకరణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. జీహెచ్‌ఎంసీ, వాటర్‌వర్క్స్‌ అధికారులతో సమన్వయం చేసుకొని సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని హైడ్రా అధికారులకు తెలిపారు. అనంతరం వివిధ విభాగాల అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. డివిజన్‌లోని కాలనీలు, బస్తీలకు చెందిన అసోసియేషన్‌ సభ్యులు కూడా పాల్గొని వారి కాలనీల్లో నెలకొన్న సమస్యలను వినతిపత్రంలో అందచేశారు. కొన్ని చోట్ల వర్షం వస్తే డ్రైనేజీ పొంగి పొర్లుతున్నాయని, అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీ పనులు, రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. అధికారులకు వినతిపత్రాలు అందజేసి సమస్యలను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూకట్‌పల్లి తన పుట్టిన ఊరు అని, ఇక్కడి ప్రజలకు ఏ లోటు రాకుండా చూసుకునే బాధ్యత తనపై ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. పది ఏళ్ల కాలంలో కూకట్‌పల్లిలోని అన్ని సమస్యలను పరిష్కరించామని వివరించారు. రోడ్లు, డ్రైనేజీ, పార్కులు, పురాతన దేవాలయాలు పునర్నిర్మాణం, ప్రజలకు కావలసిన అన్ని మౌలిక సదుపాయాలకు లోటు లేకుండా చేశామని గుర్తు చేశారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అన్ని విభాగాల అధికారులు, అసోసియేషన్‌ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్‌లు

కూకట్‌పల్లి: నియోజకవర్గంలోని ప్రభుత్వ ఆసుపత్రులు, పాఠశాలలు, ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ సంబంధిత సమస్యల పరిష్కారానికి సత్వరం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కృష్ణారావు ఆధ్వర్యంలో కలెక్టర్‌ మనూ చౌదరికి గురువారం వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలోని కార్పొరేటర్‌లతో కలిసి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డివిజన్‌ల వారీగా ఆయా కార్పొరేటర్‌లు స్థానిక సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, పాఠశాలల నూతన భవనాల నిర్మాణం, ప్రభుత్వ ప్రాథమిక, ఆసుపత్రుల సమస్యలు, ఆరోగ్య ఉప కేంద్రాలలో వసతుల కల్పన, ప్రభుత్వ భూముల్లో నిర్మించుకున్న ఇళ్ల క్రమబద్ధీకరణ, జీవో 58, 59 ద్వారా దరఖాస్తు చేసిన వారికి క్రమబద్ధీకరణ తదితర సమస్యలపై సత్వరం స్పందించాలని కోరారు. కేపీహెచ్‌బీ కాలనీలోని హౌసింగ్‌బోర్డు స్థలాన్ని పాఠశాల నిర్మాణం కోసం, వంద పడకల ఆసుపత్రి నిర్మాణం కోసం అప్పగించేందుకు సంసిద్ధత వ్యక్తం చేసినా జిల్లా స్థాయిలోని సంబంధిత అధికారులు స్పందించడం లేదన్నారు. హైదర్‌నగర్‌ గ్రామ పరిధిలోని సర్వే నంబర్‌ 145, 163 లలో వెలిసిన సర్దార్‌ పటేల్‌ నగర్‌ మొదలుకొని ఎస్‌ఆర్‌ఎస్‌పీ కాలనీ వరకు ఇళ్ల నిర్మాణ అనుమతుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు మందడి శ్రీనివాసరావు, జూపల్లి సత్యనారాయణ, ముద్దం నరసింహ యాదవ్‌, ఆవుల రవీందర్‌ రెడ్డి, పండాల సతీష్‌ గౌడ్‌, సబిహా బేగం, శిరీష బాబురావు పాల్గొన్నారు.

లాంగ్వేజ్‌ పండితులకు పదోన్నతులు కల్పించాలి



యోగితా రాణాకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కూకట్‌పల్లి: తెలంగాణ విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి, పాఠశాల సంచాలకులు యోగితా రాణాను గురువారం రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్‌ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా లాంగ్వేజ్‌ పండితులు 680 మందికి పదోన్నతులు రాక ఆందోళన చెందుతున్నారని, వారికి ప్రమోషన్‌ కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి ఆమె స్పందించి అధికారులతో సంప్రదించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్‌ అధ్యక్షులు వీఎస్‌ఎస్‌ శర్మ, ప్రధాన కార్యదర్శి రోహిత్‌కుమార్‌, జిల్లా కోశాధికారి దినకర్‌ దేశ్‌పాండే, హైదరాబాద్‌ జిల్లా అధ్యక్షులు హమీద్‌ ఖాన్‌, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఇస్మాయిల్‌ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో జిమ్‌ కోచ్‌ ఆత్మహత్య

మూసాపేట: ఆర్థిక ఇబ్బందులతో జిమ్‌ కోచ్‌ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. మూసాపేట మారుతీనగర్‌కు చెందిన తూము నరేష్‌ (40) అలియాస్‌ నరేందర్‌ జిమ్‌ కోచ్‌గా జీవనం సాగిస్తున్నాడు. కొన్ని రోజులుగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. గురువారం మధ్యాహ్నం భోజనం తరువాత వచ్చి మాట్లాడతానని తండ్రికి చెప్పాడు. ఇంకా తన వద్దకు రాకపోవటంతో తండ్రి కుమారుడి ఇంటికి వచ్చి చూడగా నరేష్‌ టవల్‌తో సీలింగ్‌ ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. కుటుంబ సభ్యులు అమోర్‌ హాస్పిటల్‌కు తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జగన్నాథ రథయాత్ర ఆహ్వానం అందజేత



ఎమ్మెల్యేకు ఆహ్వానం అందజేస్తున్న సభ్యులు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి ఇస్కా సభ్యుల ఆధ్వర్యంలో హైదర్‌నగర్‌ దేవాలయం నుంచి నిర్వహించే శ్రీ జగన్నాథ రథయాత్రకు హాజరవ్వాలని గురువారం ఆహ్వానం అందజేశారు. పీఏసీ చైర్మన్‌ గాంధీ, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కాంగ్రెస్‌ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్‌, టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్‌లను ఇస్కాన్‌ సభ్యులు ఆహ్వానించారు.

ఇస్కాన్‌ ఆలయానికి చెత్త బుట్ట అందజేత



మోతీనగర్‌: నగరంలోని ఇస్కాన్‌ దేవాలయానికి రాఘవమ్మ ఇంటిగ్రేటెడ్‌ ఎవల్యూషన్‌ డ్రైవ్‌ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డి. రవీంద్రనాథ్‌ ఠాగూర్‌ సంస్థ తరఫున చెత్త వేసేందుకు ప్లాస్టిక్‌ బుట్ట, ప్రసాదానికి అవసరమయ్యే చేతి గుడ్డ సంచులను, ఆర్థిక సహాయాన్ని గురువారం అందజేశారు. ప్రతి ఒక్కరూ ఆలయాలకు తోచినంత విరాళం అందజేయాలన్నారు.

ట్రాఫిక్‌ సిగ్నల్‌ ఏర్పాటు చేయాలి



నిరసన తెలుపుతున్న బీజేపీ శ్రేణులు

నిజాంపేట్‌: నిజాంపేట్‌ కార్పొరేషన్‌ పరిధిలోని ప్రగతినగర్‌లో ట్రాఫిక్‌ సిగ్నల్స్‌ ఏర్పాటు చేయాలని గురువారం బీజేపీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. మున్సిపల్‌ కమిషనర్‌కు నివేదించినా మార్పు లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఆలీఫ్‌ సర్కిల్‌, ఐకానిక్స్‌ సర్కిల్‌, మూడు కోతుల జంక్షన్‌ వద్ద స్కూల్‌ బస్సులు, ఉద్యోగుల పికప్‌ బస్సులు, ఆలీఫ్‌ ఇండస్ట్రియల్‌కు సంబంధించిన వాహనాలు, నీటి ట్యాంకర్లు, ప్రైవేట్‌ వాహనాలతో అనునిత్యం రద్దీగా మారిందన్నారు. ఈ మేరకు మియాపూర్‌ ట్రాఫిక్‌ సర్కిల్‌ ఇన్‌స్పెక్టర్‌ ప్రశాంత్‌ స్పందించి.. ఫీల్డ్‌ వెరిఫికేషన్‌ చేసి ట్రాఫిక్‌ కానిస్టేబుల్స్‌ను జంక్షన్‌ వద్ద ఉండేలా చూస్తామని తెలిపారు. అదేవిధంగా పై అధికారులకు వివరించి ట్రాఫిక్‌ సిగ్నల్స్‌ ఏర్పాటుకు చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నరేంద్ర చౌదరి, డాక్టర్‌ రాజు, సుమన్‌రావు, రవి యాదవ్‌, మదన్‌ మోహన్‌, కిషోర్‌, మందపాటి శ్రీధర్‌రెడ్డి, సత్యనారాయణ, శివకుమార్‌గుప్తా, నరేష్‌, రామకృష్ణ, లక్ష్మి, కోశాధికారి రవి, అనిరుద్ర, వేణుమాధవ్‌, రాహుల్‌ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్‌ నేతలు

నిజాంపేట్‌: జిల్లా కలెక్టర్‌గా మను చౌదరి నూతనంగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా గురువారం పలువురు కాంగ్రెస్‌ పార్టీ శ్రేణులు కలెక్టర్‌ను కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, కుత్బుల్లాపూర్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్‌ హన్మంత్‌రెడ్డి, మేడ్చల్‌ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్‌, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్‌



బండి రమేష్‌కు సమస్యలు వివరిస్తున్న ప్రజలు



సన్మానిస్తున్న సీపీఐ నాయకులు

కూకట్‌పల్లి: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్‌ అన్నారు. గురువారం నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి విస్తృతంగా పర్యటించారు. బాలానగర్‌ డివిజన్‌ రాజీవ్‌గాంధీ నగర్‌, ఎన్‌టీఆర్‌ నగర్‌లలో స్థానిక నాయకులతో కలిసి అభివృద్ధి పనులను పరిశీలించారు. కొత్తగా నిర్మించిన ఈద్గాలో సౌకర్యాలను పరిశీలించారు. బస్తీల్లో రహదారులు, కమ్యూనిటీ హాల్‌ లేకపోవంతో తాము ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆయన దృష్టికి తెచ్చారు. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి ఆ రహదారులకు ఎస్టిమేషన్‌ వేయడం జరిగింది. పనులు త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. అదే విధంగా స్థానికంగా ఉన్న ప్రభుత్వ స్థలాలను కబ్జాకు గురి కాకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎక్స్‌ వైస్‌ చైర్మన్‌ లక్ష్మయ్య, మార్కెటింగ్‌ కమిటీ చైర్మన్‌ పుష్పారెడ్డి, వైస్‌ చైర్మన్‌ ప్రకాష్‌, పులి శ్రీకాంత్‌ పటేల్‌, పులి శివకుమార్‌ గౌడ్‌, బాల నరసింహ, హుస్సేన్‌, శ్రీనివాస్‌, మహేందర్‌ తదితరులు పాల్గొన్నారు.

సన్మానించిన సీపీఐ నాయకులు

బాలానగర్‌: బాలానగర్‌ డివిజన్‌ పరిధిలోని రాజీవ్‌ గాంధీ నగర్‌లో గురువారం టీపీసీసీ ఉపాధ్యక్షులు బండి రమేష్‌ పాదయాత్ర నిర్వహించారు. అనంతరం శ్రీశ్రీ నగర్‌లోని సీపీఐ పార్టీ కార్యాలయంలో బండి రమేష్‌ను నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కృష్ణ, మనోహర్‌చారి, రాజు, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా



ఎల్లమ్మబండలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న పీఏసీ చైర్మన్‌ గాంధీ తదితరులు

పీఏసీ చైర్మన్‌, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లిని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని పీఏసీ చైర్మన్‌, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. ఆల్విన్‌కాలనీ, హైదర్‌నగర్‌ డివిజన్‌ల పరిధిలోని పలు అభివృద్ధి కార్యక్రమాలను గురువారం కార్పొరేటర్‌లు దొడ్ల వెంకటేష్‌గౌడ్‌, నార్నే శ్రీనివాసరావులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలని, నాణ్యతలో రాజీపడేది లేదన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో శ్మశాన వాటికలను నిర్మించుకోవటం ఆనందించదగ్గ విషయమన్నారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



మూసాపేట: విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లా ఇంటర్మీడియట్‌ ఎడ్యుకేషన్‌ ఆఫీసర్‌ కిషన్‌ అన్నారు. గురువారం కూకట్‌పల్లిలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాలను ఆయన పరిశీలించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. ప్రభుత్వ కళాశాలల్లోనే నిష్ణాతులైన లెక్చరర్లు అందుబాటులో ఉంటారని, విద్యార్థులకు ఏ చిన్న సందేహం ఉన్నా నివృత్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్‌ వెంకటయ్య, లెక్చరర్లు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు శిలాఫలకాలకే పరిమితం



సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

ఓల్డ్‌ బోయిన్‌పల్లి: డివిజన్‌లో ఏళ్లు గడుస్తున్న అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదని, శిలాఫలకాలకే పరిమితమయ్యాయని బీజేపీ నాయకుడు ఎనుగుల తిరుపతి విమర్శించారు. గురువారం నాయకులతో కలిసి డివిజన్‌ పరిధిలోని హరిజన బస్తీ, విఠల్‌ ఎన్‌క్లేవ్‌లో పాదయాత్ర నిర్వహించారు. ప్రజా సమస్యలు తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బస్తీలో రూ. 30 లక్షలతో కమ్యూనిటీ హాల్‌ నిర్మించేలా 2023లో ఎమ్మెల్యే, కార్పొరేటర్‌ పనులు ప్రారంభించారని, ఇప్పటి వరకు పనులు ముందుకు సాగలేదన్నారు. విఠల్‌ ఎన్‌క్లేవ్‌లోని ప్రధాన రహదారిలో ఉన్న మ్యాన్‌హోళ్లపై మూతలు లేక ప్రమాదకరంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీ ఈటల రాజేందర్‌ దృష్టికి తీసుకెళ్లి నిధులు విడుదలయ్యేలా కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో శేఖర్‌, పరమేశ్‌, హర్షిత్‌, తరుణ్‌, సందీప్‌, మణి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల పూజలు



ఉత్సవ మూర్తులకు అభిషేకం చేస్తున్న అర్చకులు

మూసాపేట: కూకట్‌పల్లిలోని రంగనాయక స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం ఉత్సవ మూర్తులకు నవకలశ స్నపనం, వసంతోత్సవం, శ్రీ విష్ణు సహస్ర నామ పారాయణం, స్వామివారి ఎదుర్కోలు మహోత్సవం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం 10:30 గంటలకు రంగనాయక స్వామి తరుకల్యాణ మహోత్సవం, అన్న ప్రసాద వితరణ, సాయంత్రం స్వామివారి ఊరేగింపు పూజా కార్యక్రమాలు ఉంటాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

అక్రమ అనుమతులు పొందిన సంస్థపై చర్యలు తీసుకోవాలి



కార్పొరేషన్‌ మేనేజర్‌కు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

నిజాంపేట్‌: ప్రభుత్వ భూముల్లో ఓ ప్రైవేట్‌ నిర్మాణ సంస్థ అనుమతులు రద్దు చేయాలని గురువారం ఆకుల సతీష్‌ నిజాంపేట్‌ కార్పొరేషన్‌ మేనేజర్‌ పవన్‌ కుమార్‌ను కలిసి వినతిప్రతం అందజేశారు. నిజాంపేట్‌ కార్పొరేషన్‌ పరిధిలో ప్రగతినగర్‌ సాయినగర్‌ కమాన్‌ ఆనుకుని సర్వే నంబర్‌ 141 ప్రైవేట్‌ ల్యాండ్‌లో భూమి చూపిస్తూ సర్వే నంబర్‌ 142 ప్రభుత్వ భూమి 6.5 గుంటలు ఆక్రమించుకుని అక్రమ అనుమతులు పొందిన నిర్మాణ సంస్థపై క్రిమినల్‌ కేసు నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో అరుణ్‌రావు, ఈశ్వర్‌రెడ్డి, ముఖేష్‌, ఎల్లస్వామి తదితరులు పాల్గొన్నారు.



జేఎన్‌టీయూహెచ్‌లో ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో గురువారం రాహుల్‌ గాంధీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. టీపీసీసీ ఉపాధ్యక్షులు బండి రమేష్‌, సీనియర్‌ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు పాల్గొన్నారు.